

ప్రవేశ పరీక్షలు ప్రశాంతం


పరిశీలిస్తున్న అధికారులు

నరసాపురం:ఐదు, ఇంటర్లో ప్రవేశ కోసం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని అంబేద్కర్ గురుకుల పాఠశాల బాలురు ఎల్‌బి.చర్ల ప్రిన్సిపల్ మానేపల్లి రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం ఐదు, ఇంటర్ ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 5వ తరగతిలో ప్రవేశాలకు 65 హాజరు కావాల్సి ఉండగా 50 మంది హాజరయ్యారని తెలిపారు. 15 మంది గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్ ప్రవేశాలకు 138 హాజరు కావాల్సి ఉండగా 118 మంది హాజరయ్యారని, 20 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఆదివారం జరిగిన పరీక్షలకు సోషల్ వెల్ఫేర్ హెడ్ ఆఫీస్ నుంచి కె.సుబ్రహ్మణ్యం విచ్చేసి తనిఖీలు నిర్వహించారు.

తాయిలాల హోరు.. పందేల జోరు..!



- నోటిఫికేషన్ రాకుండానే ఎన్నికల వేడి
- మహిళా ఓటర్లే లక్ష్యంగా గిఫ్ట్‌లు పంపిణీ
- సెల్‌ఫోన్లు, చీరలు, కంచాలు వంటివి అందజేత
- నియోజకవర్గాల్లో పార్టీల గెలుపుపై పందేల జోరు
- గ్రామీణ ప్రాంతాల్లో రసవత్తరంగా రాజకీయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్ రాకుండానే, అభ్యర్థుల ఎంపిక పూర్తి కాకుండానే జిల్లాలో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. మహిళా ఓటర్లే లక్ష్యంగా ఒకపక్క తాయిలాల హోరు, మరోపక్క అభ్యర్థులతో సంబంధం లేకుండా నియోజకవర్గాల్లో పార్టీల గెలుపుపై పందేల జోరు కొనసాగుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వేడి మరింత రసవత్తరంగా మారింది. రెండు జిల్లాల్లోనూ 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వైసిపి అభ్యర్థుల ఎంపికపై కొంత స్పష్టత రాగా, టిడిపి, జనసేన అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో స్పష్టత రాని పరిస్థితి ఉంది. అయితే రేపే పోలింగ్ అన్నట్లు పలు నియోజకవర్గాల్లో పరిస్థితి కన్పిస్తోంది. గతంలో ఎన్నికల ముందురోజు ఓటర్లకు తాయిలాలు, డబ్బు పంపిణీ వంటివి జరిగేవి. ఏ పార్టీ.. ఏమి ఇస్తుందనే చర్చ సైతం జనాల్లో సాగేది. ఈసారి అందుకు భిన్నంగా ఎన్నికల ప్రక్రియ సాగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే తాయిలాల పంపిణీ జోరుగా సాగుతోంది. ఏలూరులో డ్వాక్రా మహిళలతో ఓట్లు వేయించే విధంగా మెప్మా ఆర్‌పిలకు, వాలంటీర్లకు రూ.వేలు ఖరీదు చేసే సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్లను ఏ విధంగా ప్రలోభపెట్టాలో శిక్షణ సైతం ఇస్తున్నారు. ఆచంట, పాలకొల్లుతోపాటు పలుచోట్ల డ్వాక్రా మహిళలకు చీరల పంపిణీ ఇప్పటికే సాగిపోయింది. ఉండిలో కంచాలు పంపిణీ చేశారు. అధికారులు కళ్లెదుటే ఈ ప్రక్రియ కొనసాగుతున్నా ఎక్కడా అరికట్టేందుకు చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. తాయిలాల పంపిణీలో అధికార పార్టీ మరింత దూకుడుగా ముందుకు సాగుతోంది. గిఫ్ట్‌లు అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఆరోగ్యశ్రీ కార్డులు, పింఛన్ సొమ్ము సైతం వైసిపి నాయకులే స్వయంగా ఇస్తూ ఓటు తమకే వేయాలంటూ ఓటర్లపై ఒత్తిడి తెస్తున్న పరిస్థితి ఉంది. మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకునేలా వెలుగు, మెప్మా సిబ్బందికి గిఫ్ట్‌లు అందించిన పరిస్థితి జిల్లాలో ఉంది. వాలంటీర్లకు సైతం పెద్దఎత్తున బహుమతులు అందిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేవిధంగా ప్రణాళికలు రచించారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్తూ ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్నారు. జనాలను తమవైపు తిప్పుకునేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో మరింత వేగంగా ముందుకు సాగుతున్నారు.

గెలుపుపై పందేల జోరు..

గతంలో ఎన్నికలు ముగిసిన తర్వాత ఏ అభ్యర్థి గెలుస్తారో అనే దానిపై బెట్టింగులు సాగేవి. కొన్ని పందేలు అభ్యర్థులు గెలుపుపై కొనసాగేవిగా ఉండగా, మెజార్టీపై మరికొన్ని పందేలు సాగుతుండేవి. ప్రస్తుత ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ పూర్తికాకుండానే పందేల జోరు కొనసాగుతోంది. టిడిపి, జనసేనకు సంబంధించి అభ్యర్థుల పేర్లు పూర్తిస్థాయిలో వెలువడకపోయినా సీట్ల కేటాయింపుపై స్పష్టత రావడంతో దాని ఆధారంగా బెట్టింగులు సాగుతున్నాయి. నిన్నటి వరకూ నరసాపురం వంటి నియోజకవర్గాలో టిక్కెట్ ఏఅభ్యర్థికి వస్తుందో సైతం పందేలు సాగాయి. ఇప్పుడు నియోజకవర్గాల్లో ఏ పార్టీ గెలుస్తుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. వైసిపి గెలుస్తుందా, టిడిపి, జనసేన కూటమి గెలుస్తుందా అంటూ గ్రామాల్లో పందేలు సాగుతున్నాయి. ఈ పందేలు సాగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

క్యాష్ కొట్టు.. టిక్కెట్ పట్టు..!

'మీ దగ్గర డబ్బుందా.. అయితే టిక్కెట్ మీకే'.. ప్రస్తుతం ప్రధాన రాజకీయ పార్టీల్లో ఇదే ట్రెండ్ నడుస్తోంది. రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల వద్ద సొమ్ముంటే పోటీకి అర్హతున్నట్లే అన్నట్లుగా రాజకీయ పార్టీల అధినేతలు వ్యవహరిస్తుండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఎంఎల్‌ఎగా పోటీ చేయాలనుకుంటే రూ.50 కోట్లు, ఎంపీగా పోటీ చేయాలనుకుంటే రూ.వంద కోట్లకు పైనే ఖర్చు చేయాల్సి ఉంటుందని షరతు కూడా విధించారు. కొంతమంది అభ్యర్థులు ఇప్పటికే దీనికి సంబంధించి కోట్లాది రూపాయలు ఆయా పార్టీల అధిష్టానాల వద్ద జమ చేసినట్లు సమాచారం.



- రాబోయే ఎన్నికల్లో పోటీకి డబ్బే ప్రామాణికంగా ప్రధాన పార్టీలు
- ఎంఎల్‌ఎకు రూ.50 కోట్లు, ఎంపీకి రూ.100 కోట్లకుపైనే
- ఎన్నికలను పూర్తిగా డబ్బు మాయం చేసిన రాజకీయ పార్టీలు

ప్రజాశక్తి - భీమవరం

డబ్బుంటేనే టిక్కెట్. ఇదీ వైసిపి, టిడిపి, జనసేన.. ఏ పార్టీకైనా ప్రామాణికం. డబ్బు లేకుంటే ఎంతటి సీనియర్ నేతైనా ఇంటి దగ్గరే కూర్చోవాలి. ఇప్పటికే వైసిపితోపాటు టిడిపి, జనసేన అభ్యర్థులకు టిక్కెట్ల కేటాయింపులో డబ్బునే ప్రామాణికంగా తీసుకున్నారనే ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించాయి. అధికార వైసిపి కూడా రెండు ఎంపీ స్థానాలతోపాటు మిగిలిన అసెంబ్లీ స్థానాలకూ అభ్యర్థిత్వాలను దాదాపు ఖరారు చేసింది. అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎస్‌సి, బిసిలైతే కనీసం రూ.30 కోట్లు, జనరల్ స్థానాల్లో అయితే రూ.50 కోట్లు కనీసం ఉండాలని షరతు పెట్టి టికెట్లు కేటాయిస్తున్నారని ప్రచారం సాగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థిత్వాల కోసం నేతలు ఆస్తులను తనఖా పెడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో టిడిపికి కంచుకోటగా ఉన్న ఒక నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఒక నేత ఇటీవల కొంత ఆస్తి అమ్మగా వచ్చిన డబ్బును అధిష్టానానికి డిపాజిట్ చేశారని, అలాగే మరికొంత ఆస్తిని తనఖా పెడుతున్నారని ప్రచారం సాగుతోంది. ఇదే నియోజకవర్గంలో మాజీ ఎంఎల్‌ఎ టిక్కెట్ ఆశించినా ఆయన వద్ద అంత సొమ్ము లేదనే కారణం చూపి టిక్కెట్ కేటాయించలేదని ప్రచారం సాగుతోంది. తీర ప్రాంతంలో ఉన్న నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. గత ఎన్నికల్లో అధికార వైసిపిపై అతి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన అభ్యర్థి వద్ద అంత సొమ్ము లేదని మరో నేతను తెరపైకి తీసుకొచ్చినట్లు ప్రచారం సాగుతోంది. వైసిపికి చెందిన కొంతమంది అభ్యర్థులు రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు వరకూ అధిష్టానానికి డిపాజిట్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో ధనికులైన అభ్యర్థులు లేక ఉన్నవారినే బరిలోకి దింపుతూ ఆయా నియోజకవర్గాల్లోని పార్టీ విధేయులు, వ్యాపారులకు బాధ్యత అప్పగిస్తున్నారు. ఇప్పుడు అభ్యర్థి గెలుపునకు సహకరిస్తే అధికారంలోకి వచ్చాక మీకు అవసరమైన పనులు చేసి పెడతామని ఆఫర్ ఇస్తున్నట్లు ప్రచారం ఉంది. ఏదేమైనా ఎన్నికల్లో పోటీ అంటే ప్రస్తుతం డబ్బే అర్హతగా మారింది. అయితే వామపక్షాలు మాత్రమే ప్రజా సమస్యలపై పోరాటాల అజెండాను తీసుకుని నిరంతరం ముందుకు సాగుతున్నాయి.

తాగునీటి సరఫరాకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం


అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

వేసవిలో తాగునీటి సరఫరాకు తక్షణం యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. మార్చి నెలాఖరు నాటికి తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపాలన్నారు. ఫిల్టర్ బెడ్ల మరమ్మతులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణం జలజీవన్ మిషన్ నిధుల ద్వారా పూర్తయిన పనులను వినియోగంలోకి తేవాలన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరాలో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులున్నాయో నివేదిక తయారు చేసుకుని పరిష్కార చర్యలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. శివారు ప్రాంతాలకు ప్రతిరోజూ నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులూ రాకుండా చూడాలని సూచించారు. దాళ్వా సాగులో శివారు ప్రాంత భూములకు నీటి కొరత లేకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ పి.శ్రీనివాస్, ఎఇలు టి.లోకేష్, యు.రవిరాజు, ఇరిగేషన్ ఎఇ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చింతలకోటిగరువులో టిడిపి మండలాధ్యక్షుడిని కోరుతున్న యుటిఎఫ్ నాయకులు

ఒపిఎస్ పునరుద్ధరించాలి

టిడిపి నేతలకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఈ అంశాన్ని టిడిపి మేనిఫెస్టోలో పెట్టించాలని యుటిఎఫ్ నేతలు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు నేతలంతా ఆదివారం శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఒపిఎస్ వల్ల ఉద్యోగులు ఏవిధంగా నష్టపోతున్నారో యుటిఎఫ్ నాయకులు ఆయనకు వివరించారు. దీనిపై టిడిపి నేత శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సమస్యలను పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, సీనియర్ నాయకులు జివివి. రామానుజరావు, ముద్రగళ శ్రీనివాసరావు, నేలపాటి ప్రసాదుబాబు పాల్గొన్నారు.

రణమా.. మౌనమా..!

మరికొద్ది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడనుంది. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఖరారు ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఉమ్మడి జిల్లాలో అధికార వైసిపి అభ్యర్థులు దాదాపు ఖరారైనట్లేనని చెప్పొచ్చు. ప్రతిపక్ష టిడిపి జిల్లాలో పోటీ చేసే ఏడు స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించింది. మరో ఏడు స్థానాల్లో ఐదు స్థానాలు జనసేనకు, ఒక స్థానం బిజెపికి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే టిడిపి నుంచి దెందులూరు స్థానానికే అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంటుంది.

అధికార పార్టీ వైసిపి ఒక చింతలపూడిలోనే ఇంటిపోరుతో సతమతమవుతోంది. అదీ పోటీలో లేని ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్యే సాగుతుండడం గమనార్హం. తొలుత టిక్కెట్ దక్కలేదని నిప్పులు చెరిగిన చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజా తర్వాత తన రూటు మార్చి పార్టీలోనే ఉంటూ, వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనంటూ ఎంఎల్‌ఎగా దూకుడు పెంచారు. అదే సమయంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.విజయరాజుచే ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయించడంపై ఎంఎల్‌ఎ గ్రూపు గుర్రుగా ఉంది. దీంతో తన అనుచరగణంతో కొన్ని గ్రామాల్లో ఎలిజా ప్రారంభోత్సవాలు చేపట్టడం ఆ పార్టీలో నెలకొన్న విభేధాలకు నిదర్శనమని చెప్పొచ్చు. రానున్న రోజుల్లో ఆ పార్టీ అధిష్టానం దీన్ని ఎలా సరి చేస్తుందో వేచిచూడాలి.

ఇక ప్రతిపక్ష పొత్తు వల్ల వచ్చే లాభాలు ఎలాగుంటాయోగాని ప్రస్తుతం మాత్రం టిడిపి, జనసేన పార్టీలు తమ నేతల నుంచి తీవ్ర అసంతృప్తి, అసమ్మతి గళాలను ఎదుర్కోక తప్పడం లేదు. జనసేన అధిష్టానానికి తణుకు, ఏలూరు నియోజకవర్గాల్లో ధిక్కార స్వరం విన్పించగా.. టిడిపికి ఉండిలో మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు నుంచి ధిక్కారస్వరం విన్పిస్తోంది. అయితే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా.. లేక మౌనం వహిస్తారా అనేది వేచిచూడాలి. నూజివీడులో మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా లేక ఏ వైఖరి తీసుకుంటారో ఇంకా స్పష్టత లేదు.

అయితే ఇంకా అధికారికంగా ప్రకటన చేయని స్థానాల్లోనూ టిడిపి నేతలు తిరుగుబావుటా ఎగురేస్తుండటం ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా పరిణమించిందనే చెప్పొచ్చు. దెందులూరు మినహా అభ్యర్థులను ప్రకటించాల్సిన కైకలూరు, పోలవరం, ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం స్థానాలు జనసేన, బిజెపికి కేటాయించనున్నట్లు టిడిపి అధిష్టానం ఆయా నియోజకవర్గాల్లోని తమ పార్టీ నేతలకు సమాచారం ఇచ్చింది. వీటిలో ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, పోలవరం నియోజకవర్గాల్లో టిడిపి నేతల నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. తాడేపల్లిగూడెంలో నేతలు సర్దుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నా పోలింగ్ సమయానికి ఎలా వ్యవహరిస్తారనేది వేచిచూడాలి. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని ఉంగుటూరు టిక్కెట్ ఆశించిన గన్ని



వీరాంజనేయులుపై టిడిపి మండల నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆ పార్టీ నేతలు గన్నికే టిక్కెట్ ఇవ్వాలంటూ అమరావతి వెళ్లి పార్టీ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వడం గమనార్హం. చంద్రబాబు నేరుగా మాట్లాడినా గన్ని ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఇక పోలవరం నియోజకవర్గంలో అయితే టిడిపి శ్రేణులు రగిలిపోతున్నాయి. మూకుమ్మడి రాజీనామాలకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధపడటం గమనార్హం. నరసాపురం పార్టీ మూడు గ్రూపులుగా చీలిపోవడంతో టిడిపి అధిష్టానానికి ఎటువంటి ఇబ్బందీ లేకుండాపోయిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. భీమవరం నుంచి పవన్‌కళ్యాణ్ పోటీ చేయకుండా జనసేన అభ్యర్థిగా మాజీ ఎంఎల్‌ఎ పి.అంజిబాబు రంగంలోకి దిగితే టిడిపి శ్రేణులు సహకరించడం అనుమానమేనని ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలే చెబుతుండటం గమనార్హం. గోదావరి జిల్లాల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్న పార్టీనే అధికారంలోకి వస్తుందనే నమ్మకం ఉన్నప్పుడు జనసేనకు దాదాపు సగం స్థానాలు కేటాయించడమేమిటని టిడిపి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇక కైకలూరు స్థానాన్ని బిజెపికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. గత టిడిపి ప్రభుత్వంలో బిజెపి నుంచి గెలుపొందిన కామినేని శ్రీనివాస్ మంత్రిగా పని చేసిన సంగతి తెలిసిందే. తర్వాత ఆయన ఎప్పటిలానే టిడిపితో చెట్టాపట్టాలేసుకుని ఉండేవారు. అయితే పొత్తుల నేపథ్యంలో బిజెపి కోటాలో తమ మనిషిని రంగంలోకి దింపేందుకు కైకలూరు సీటు చంద్రబాబు వదులుకున్నట్లు ప్రచారం సాగుతోంది. పైగా అక్కడి మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ టిడిపికి గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే.

ఇక ఎంపీ సీట్లకొస్తే ఏలూరు, నరసాపురం స్థానాల్లో ఏదోకటి బిజెపికి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. నరసాపురం స్థానం కేటాయిస్తే మాజీ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు బరిలోకి దిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే జన స్పందన ఎలా ఉంటుందో ఆసక్తికర అంశమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఎలాగున్నా ఏక్షణం ఏ పార్టీలో ఉంటారో తెలియని వ్యక్తికి, రెండు పార్టీల తరపున నామినేషన్లు వేసిన చరిత్ర కలిగిన వ్యక్తికి టిక్కెట్ ఇస్తే అధికార వైసిపికి ఆయుధం ఇచ్చినట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో ఏలూరు నుంచి పోటీ చేయడానికి బిజెపి నేత గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపనా చౌదరి) ఉవ్విళ్లూరుతున్నారు. ఇటీవల బూత్ ఏజెంట్ల సమావేశానికి సైతం కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజనాథ్‌సింగ్‌ను ఆహ్వానించి ఏలూరులో సమావేశం నిర్వహించారు. అయితే నరసాపురం సీటు బిజెపికి ఇస్తే ఏలూరు సీటు ఇవ్వడం అసాధ్యం. అదే జరిగితే తపనా చౌదరి ఏ వైఖరి తీసుకుంటారో వేచిచూడాలి. ఏదేమైనా ఈ ఎన్నికల్లో ఇప్పటి వరకూ పరిశీలిస్తే అధికార పార్టీకన్నా ప్రతిపక్ష పార్టీలకే అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాటులో తలనొప్పులు ఎక్కువయ్యానేది బహిరంగ రహస్యం. సీట్లు, టిక్కెట్లు దక్కని నేతలు ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగి 'ఇక రణమే..' అంటారా, లేక వ్యూహాత్మక మౌనం వహిస్తారా అనేది వేచిచూడాలి.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

నేడు ఎస్‌బిఐ బ్రాంచీల వద్ద ధర్నాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలను స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వెంటనే ప్రకటించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీ సోమవారం ఆ బ్యాంకు బ్రాంచీల వద్ద జిల్లావ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాండ్ల వివరాలను ఈ నెల ఆరో తేదీకి ఎన్నికల కమిషన్‌కు ఇవ్వాలని, ఎన్నికల కమిషన్ మార్చి 13 నాటికి వివరాలను బహిర్గత పర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్న ఎస్‌బిఐ ఎన్నికలయ్యే వరకూ గడువుకోరడం మోడీ ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగడమేనని, బిజెపి బండారం బయటపడకుండా కాపాడటమేనని విమర్శించారు. దీన్ని నిరసిస్తూ సోమవారం నిర్వహించే ధర్నాల్లో పాల్గొని ప్రజలు నిరసన తెలపాలని కోరారు.

శివరాత్రి వేడుకల్లో అపశృతి

బాణసంచా పడి బాలిక మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


మృతి చెందిన దాసరి పుష్ప

తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం గ్రామంలో శివరాత్రి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. బాణాసంచి పడి కాలిన గాయాలతో బాలిక మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన దాసరి పుష్ప (12) ఏడో తరగతి చదువుతోంది. ఆమె తన బంధువులతో కలిసి వీరంపాలెంలో జరుగుతున్న శివరాత్రి వేడుకలు తిలకించడానికి వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి బాణాసంచా కాల్చేసమయంలో ఆకాశంలోకి వేసిన బాణాసంచా విఫలమై పుష్ప తలపై పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తాడేపల్లిగూడెం రూరల్ సిఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, బాణాసంచా ప్రజల మధ్య కాల్చడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతురాలి బంధువులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

రైస్‌మిల్లింగ్ పట్ల ప్రభుత్వ విధానం మారాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు


మాట్లాడుతున్న జెఎన్‌వి గోపాలన్

రైస్‌మిల్లింగ్ పట్ల ప్రభుత్వ విధానం మారాలని, లేనిపక్షంలో ఉద్యమించాల్సి వస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ హెచ్చరించారు. రైస్‌మిల్లు కార్మికుల సంఘం అధ్యక్షులు తమ్మిశెట్టి గోపాలన్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో రైస్‌మిల్లు కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ ఆక్వారంగాన్ని సాకుగా చూపుతూ ప్రభుత్వం మిల్లులకు ధాన్యం సక్రమంగా సరఫరా చేయకపోవడం సరైన విధానం కాదన్నారు. 365 రోజులకు సరిపడా ధాన్యం రైస్ మిల్లులకు ప్రభుత్వం ఇవ్వని కారణంగా కార్మికులకు పూర్తిస్థాయిలో పని ఉండటం లేదన్నారు. దీంతో వలసలు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైస్‌మిల్లులకు పూర్తిస్థాయిలో ముడి సరుకులు సరఫరా చేసి, మిల్లులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కార్మికులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, గండేటి ఈశ్వరరావు, రత్తయ్య, పైలా శీను, బడుగు సాంబశివరావు, చీకటి శ్రీను, యర్ర శీను, నిమ్మల శ్రీను, నాగమ్మ, రూపాదేవి పాల్గొన్నారు.

త్రిశూల వ్యూహంలో వైసిపి గల్లంతు : పితాని

ప్రజాశక్తి - ఆచంట


మాముదూరులో పాదయాత్ర చేస్తున్న పితాని

టిడిపి, జనసేన, బిజెపి త్రిశూల వ్యూహంలో రాష్ట్రంలో వైసిపి గల్లంతవ్వడం ఖాయమని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం పెనుమంట్ర మండలం మాముడూరులో పితాని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమితో పాటు బిజెపి కలవడం ఇది చారిత్రాత్మిక ఘట్టమనే అన్నారు. జగన్మోహన్ రెడ్డి అవినీతి అరాచక హత్యా రాజకీయాలతో ఎందరినో పొట్టను పెట్టుకున్నారని విమర్శించారు. సిద్ధం సభకు మీడియా సంస్థలు రావొద్దు అంటూ పోలీసులు నోటీసులు జారీ చేస్తారా అంటూ విమర్శించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమికి ఓటేయాలని అభ్యర్థిస్తున్నామన్నారు. సర్పంచుల ఛాంబర్ గౌరవాధ్యక్షులు పిల్లి సత్తిరాజు, నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు వెంగళదాసు దానయ్య, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు వెలగల బులిరామరెడ్డి పాల్గొన్నారు.

రైతులందరికీ భూ హక్కు పత్రాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నం రెవెన్యూ గ్రామల్లోని రైతులందరికీ భూమికి సంబంధించి ప్రభుత్వం హక్కు పత్రాలు అందజేయనుందని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ తెలిపారు. జగన్నాథపురం పంచాయతీ పరిధి దాలితిప్పలో సరిపల్లి సుబ్బరాజు ఇంటి వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళీపట్నం భూములకు సంబంధించి జీవీలు ప్రభుత్వం తీసుకున్న ప్రభుత్వ చర్యలపై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని రైతులకు ఆయన సూచించారు. కాళీపట్నంలో 9 మంది రైతులకు 1945 కంటే ముందు నుంచి అనుభవంలో ఉన్న హక్కుదారులకు పట్టా పంపిణీ చేశారన్నారు. ఈ ప్రక్రియ భవిష్యత్తులో కూడా కొనసాగుతుందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకూ హక్కు పత్రాలు అందజేసేందుకు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కృషి చేస్తున్నారన్నారు. కాళీపట్నం సొసైటీ ఛైర్మన్ దొంగ నాగమని మాట్లాడారు. కాళీపట్నం రైతుల సమస్యలు పరిష్కరించిన వైసిపి ప్రభుత్వానికి, ప్రసాదరాజుకు అండగా ఉంటామని అన్నారు. ఈ సమావేశంలో మొగల్తూరు సొసైటీ ఛైర్మన్ మోటుపల్లి రామ భాస్కరరావు, దొంగ మురళి, రామాని ఉమా మహేశ్వరరావు, వడవల సత్యనారాయణ, మారిపోయిన అప్పారావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



కాళ్ల : కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి - నరసాపురం

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని నరసాపురం రూరల్ సిఐ కె.గోవింద్‌రాజు, రూరల్ ఎస్ఐ కె.గుర్రయ్య అన్నారు. ఆదివారం మండలంలోని సారవ గ్రామంలో రూరల్ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యంలో గ్రామంలో కవాతు నిర్వహించారు. సారవ సెంటర్ నుంచి చిన్న సారవ సెంటర్ వరకూ వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గోవింద్ రాజు, గుర్రయ్య మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో అల్లర్లు, కవ్వింపు చర్యలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రశాంత వాతావరణం కలిగిస్తున్నామన్నారు.

కాళ్ల : సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాన్య ప్రజల్లో భద్రత, విశ్వాసాన్ని పెంపొందించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు ఆకివీడు సిఐ సత్యనారాయణ తెలిపారు. కేంద్ర బలగాలతో ఏలూరుపాడు, దొడ్డనపూడి గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా, శాంతియుత వాతావరణంలో ఓటు వేసేందుకు పటిష్ట భద్రతలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మొద్దని, ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అక్రమాలు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కవాతులో కాళ్ల ఎస్ఐ వీరభద్రరావు, పోలీస్‌లు పాల్గొన్నారు.

మల్లవరంలో జనంలోకి జనసేన

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని మల్లవరం గ్రామ పంచాయతీ మల్లవరం నడివీధి నుంచి హరిజన పేట వరకూ జన సైనికులు, వీర మహిళలతో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం వచ్చేలా ప్రజలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్కం బాబ్జి, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, గుబ్బల మార్రాజు పాల్గొన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరవాసరం

మత్స్యపురిలో కీశే పాలింకి మాణిక్యం రాముడు జ్ఞాపకార్థం వారి మనవడు డాక్టర్ మాణిక్య ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో గుంటూరు విజయశ్రీ హాస్పిటల్ వారు నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 50 మందికి గుండెకు సంబంధించిన 2 డి ఎకో పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 80 మందికి అనారోగ్య సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. వీరిని మెరుగైన వైద్య కోసం సిఫార్సు చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రావుల సురేష్, బోడపాటి రంగబాబు, చింతా నారాయణమూర్తి, పాలంకి యేసు, అడపా నాగరాజు, గట్టిగొప్పుల శ్రీనివాస్, రావూరి వెంకట్రావు, కురెళ్ల అప్పాజీ పాల్గొన్నారు.


నిర్మానుష్యంగా ఉన్న నరసాపురం బస్టాండ్

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - నరసాపురం

బాపట్ల జిల్లా లో జరిగిన సిఎం జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు నరసాపురం డిపో నుండి22 బస్సులు వెళ్లాయి. ఉద్యోగులకు వరుస సెలవులు కావడంతో ప్రయాణాలు చేసేందుకు సిద్ధమైన ప్రయాణికులు బస్సు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. దీంతో నరసాపురం ఆదివారం బస్టాండ్ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. శుక్ర ,శని, ఆదివారం సెలవు కావడంతో తిరుగు ప్రయాణానికి బయలుదేరిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

విద్యుదాఘాతంతో.. యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఉండి

విద్యుదాఘాతానికి యువకుడు మృతి చెందిన ఘటన ఉండిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఉండి-గణపవరం రహదారిలోని పాత సిమెంట్ ఇటుకల పరిశ్రమను రొయ్యల ఒలుపు కేంద్రంగా మారుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం అక్కడి కొబ్బరి చెట్టు ఆకులు తొలగించే పనిలో ఉండగా విద్యుత్ తీగలకు కత్తి తగిలి జార్కండ్‌కు చెందిన గఫూర్ (24) విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే తొలుత ఉండి పిహెచ్‌సికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి గఫూర్ మృతి చెందాడు.

పశువుల వ్యథ పట్టదా..!

పూడుకుపోయిన పశువుల చెరువులు - తవ్వకానికి సహకరించని అధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

మత్స్యపురిలో రాజకీయ విభేదాల వల్ల పాడి పశువులు బలి పశువులుగా మారాయి. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు పశువులు చెరువుల్లో సేద తీరేందుకు అవకాశం ఉన్నా అందుకు అధికారులు సహకారం కొరవడడంతో పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యపురి అరుంధతీపేట వద్ద పశువుల చెరువు పూడుకుపోవడంతో అందులో నీటిని నింపే పరిస్థితి లేదు. వేసవి కాలం కావడంతో పంచాయతీ వారు పూడికతీత అంచనాలు రూపొందించాలంటూ తీర్మానం చేసి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు పంపినా ఆ పని తమ పరిధిలోది కాదంటూ చెబుతున్నారని పంచాయతీ పాలకవర్గ నాయకులు చెబుతున్నారు. దీంతో ఆ గ్రామంలో నెలకొన్న రాజకీయ విభేదాల వల్లే అధికారులు దాటవేత వైఖరి అవలంబిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి.


మత్స్యపురిలో పూడుకుపోయిన పశువుల చెరువు

ఈ విభేదాలు పక్కనబెట్టి పశువుల చెరువును తవ్వకానికి అధికారులు చర్యలు తీసుకోవాలంటూ రైతులు కోరుతున్నారు. గ్రామంలో 700 గేదెలు, 200 ఆవులు ఉన్నాయి. పూడుకుపోయిన చెరువుతో పాటు పశువులు ఆసుపత్రి వద్ద మరో పశువుల చెరువు ఉంది. ఈ రెండు చెరువుల మధ్య రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ ప్రాంతంలోని పశువులు అంత దూరంలో ఉన్న మరో పశువుల చెరువుకు తోలుకెళ్లేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో అరుంధతీ పేట వద్ద పూడుకుపోయిన పశువుల చెరువు పూడిక తీతకు అధికారులు ముందుకురావాలని రైతులు కోరుతున్నారు. వేసవిలో పశువులు వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి పశువులకు చెరువులు ఎంతోగానో ఉపయోగపడతాయని మండల పశువైద్యాధికారి ప్రియాంక తెలిపారు. పశువులకు స్వేద గ్రంధులు ఉండవని అయితే గేదెల శరీరం నల్లగా ఉండటం వల్ల వాటికి వేడిని శోషించుకునే గుణం ఎక్కువన్నారు. గేదెలు ఉష్ణతాపం తగ్గించుకోవడానికి ఉన్న ఏకైక మార్గం చెరువులేనన్నారు. గేదెలకు వేసవి తాపం ఎక్కువైతే మేత తినవని దీంతో ఆ ప్రభావం పాల దిగుబడిపై పడుతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు ప్రత్నామ్నాయ మార్గాల ద్వారా పవువులకు వేసవి తాపం తగ్గించే ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

4వ రోజు కొనసాగిన చలివేంద్రం


ఆచంటలో పాదచారులకు మజ్జిగను పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆచంట

సేవా దృక్పథంతో పాదచారుల దాహార్తిని తీర్చడమే ప్రజాసంఘాల ముఖ్యోద్దేశమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆచంట కచేరీ సెంటర్లో మహాశివరాత్రి సందర్భంగా వచ్చే యాత్రికుల కోసం నెక్కంటి రామదాసు అన్నపూర్ణమ్మ స్మారకార్థం సిఐటియు, యుటిఎఫ్, డివైఎఫ్ఐ, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్ర కేంద్రం 4వ రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో భాగస్వామ్యం కావడం అభినందనీయమని కొనియాడారు. దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారుల దాహార్తిని తీరుస్తూ ముందుకెళ్తున్నామన్నారు. నార్గిన నరసింహమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారులు నార్జన శ్రీనివాస్, విజయ్, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో యుటిఎఫ్, శ్రీభరత్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం నిర్వహణకు దాతలు ముందుకు రావడంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, పరువు మోహన్‌రావు, వర్తిపర్తి అంజిబాబు, తోటపల్లి సత్యనారాయణ, సహదేవుడు, రాజశేఖర్, వర్ధనపు శ్రీను, కుసుమే జయరాజు, మానుకొండ రాంబాబు, అంద్రు రామారావు, బొర్రా ధర్మారావు, తలుపురి బుల్లబ్బాయి, కరిణ బెంజిమెన్ పాల్గొన్నారు.

రూ.1.38 లక్షలతో పార్కు అభివృద్ధి

నేడు ప్రారంభించనున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. వరుస సెలవులు కావడంతో సాయంత్రం సమయంలో పెద్ద సంఖ్యలో పట్టణంలోని పర్యాటకులే కాకుండా మొగల్తూరు, నరసాపురం మండలాల ప్రజలు ఈ పార్కుకు వస్తున్నారు. కాటన్ పార్కులో నూతనంగా రూ.1.38 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. ఈ నెల 11వ తేదీన పార్కును రాష్ట్ర చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించనున్నారు. ఆధునిక హంగులతో పార్కును అభివృద్ధి చేశారు. గతంలో మూతపడ్డ పార్కు సోమవారం నుండి పట్టణ ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే పార్కును పట్టణ ప్రజలు సందర్శిస్తూ సెలవు దినాల్లో, సాయంత్రం సమయాల్లో సేదతీరున్నారు. పార్క్‌కు రావాలంటే గతంలో రైల్వే స్టేషన్ రోడ్డు నుండి రావాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు 29 లక్షలతో బస్టాండ్ వైపు నుండి నరసాపురం ప్రధాన కాలువపై కాలిబాట వంతెన నిర్మించారు. బస్టాండ్‌లో దిగిన ప్రయాణికులకు అటువైపు నుండి వచ్చే ప్రయాణికులకు ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడింది. ఇప్పటికే నిర్మాణ దశలో ఉండగానే పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తున్నారు. పూర్తిస్థాయిలో సోమవారం ఓపెన్ కావడంతో పర్యటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పిల్లలకు జారుడు బల్లలు, ఉయ్యాలలు, సెల్ఫీలు దిగేందుకు బటర్ ఫ్లైలు, ఐ లవ్ యు నర్సాపురం నేమ్ బోర్డు, లైటింగ్, పచ్చని మొక్కలు వంటివి ఏర్పాటు చేశారు. నరసాపురంలో నియోజకవర్గ పరిధిలోని ఒక పార్క్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పలువురు ఆనందిస్తున్నారు. ప్రత్యేక ఆకర్షణగా లైటింగ్ నిలుస్తోంది. పార్కును ఆనుకుని 10 మంది వరకూ చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశం ఏర్పడింది.



అభివృద్ధి చేసిన నరసాపురంలోని పార్కు


మాట్లాడుతున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

ఆదరించండి.. గెలిపించండి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

రాబోయే రోజుల్లో జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిని ఆదరించి గెలిపించాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు కోరారు. పెన్నాడ అగ్రహారంలో రెండో రోజు ఇంటింటికీ రాంబాబు కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరావు (కోటిరాజు) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు ఇంటింటికీ తిరిగి ఉమ్మడి మేనిఫెస్టో లోని పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడారు. ఎన్నికలకు కొద్ది రోజుల సమయం మాత్రమే ఉందని, ప్రజలు ఈసారి ఆలోచించి ఓటు వేయాలని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమం అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ బిసి నేత కామన రాంబాబు, మాజీ ఎంపిపి వీరవల్లి వెంకటలక్ష్మి రమణ, జనసేన మండల అధ్యక్షులు గాదం నానాజీ, నాయకులు నడిపూడి అప్పారావు, చేబోలు రామకృష్ణ పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

నిరంతరం కష్టపడడం ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని ప్రముఖ వైద్యులు రాజశేఖర్ చెప్పారు. పాలకొల్లు విద్యా, చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో 7, 9 తరగతి విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తారు. ఈ సందర్భంగా పాలకొల్లు ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో ఆదివారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా పాలకొల్లు పరిసర 7 మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించడం సాహసం అన్నారు. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ విలువైన సమయాన్ని విద్యార్థులకు కేటాయించటం హర్షణీయమని చెప్పారు. 600 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు చెప్పారు. సమావేశానికి సంఘ కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ అధ్యక్షత వహించారు. పనస శ్రీనివాస్, మంచెం నాగకృష్ణ స్మారకంగా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులుగా రామ్మోహన్

ప్రజాశక్తి - పాలకొల్లు



నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడిగా పాలకొల్లుకు చెందిన ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణులు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని నీతి అయోగ్‌కు చెందిన హ్యూమన్ రైట్స్ నేషనల్ కౌన్సిల్ నుంచి సమాచారం అందింది. ఇప్పటికే రామ్మోహన్ రాష్ట్ర బిల్డింగ్ ప్లాన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. రామ్మోహన్ నియామకం పట్ల పాలకొల్లు రోటరీ క్లబ్, యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ క్లబ్ గవర్నర్ ముచ్చర్ల సంజయ్, వ్యవస్థాపకులు పోకల రాము, అధ్యక్షులు గాదె ఆంజనేయులు, కార్యదర్శి పశ్యావుల రవికుమార్ కోశాధికారి ఇనుకొండ శేషాద్రి శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్న కాలనీల పేరిట దోపిడీ

మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

తణుకు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో వైసిపి నేతలు దందా చేస్తున్నారని మాజీ ఎంఎల్ఎ రాధాకృష్ణ విమర్శించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. వివిధ గ్రామాల్లో జగనన్న కాలనీ పేరు చెప్పి వైసిపి నేతలు ప్రజల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని విమర్శించారు. నియోజవర్గంలో 48 గ్రామాల్లో 16 రోజులపాటు కాలినడకన ఊరోర తిరుగుతూ పాదయాత్ర చేసి ప్రజల స్థితిగతులను పరిశీలించడంతోపాటు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ప్రజలకు వివరించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో రెండుసార్లు పాదయాత్ర చేయగలిగే అవకాశం తనకు దక్కిందన్నారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు ఎక్కడికి వెళ్లినా రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. కమిషన్లకు కక్కుర్తి పడి నాసిరకంగా డ్రెయినేజీలు కట్టడంతో మురుగునీరు పారుదల లేక నిలిచిపోయి దోమలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పాదయాత్రను విజయవంతం చేసినందుకు టిడిపి, జనసేన నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, నాయకులు బసవ రామకృష్ణ, పితాని మోహన్‌రావు, ఆనాల ఆదినారాయణ, గుబ్బల శ్రీనివాస్ తోట సూర్యనారాయణ, రాంబాబు మారుతీరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి టిడిపి శ్రేణులు పూలమాలవేసి నివాళు లర్పించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుతోనే అమలు చేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చేయూత నాలుగో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఎస్‌సి, బిసి, మైనార్టీ అక్కా చెల్లెలు అందరికీ నాలుగు విడతల్లో 18750 చొప్పున 75 వేల రూపాయలు ఆర్థిక సాయం సిఎం జగన్ అందజేసి అండగా నిలబడ్డారు అన్నారు. ఆడపిల్లల చదువు కుటుంబ అభివృద్ధికి దోహదపడుతుందనే ఉద్దేశంతో కోట్లాది రూపాయలు వెచ్చించి పేద విద్యార్థుల కోసం అమ్మ ఒడి విద్యా దీవెన గోరుముద్ద వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ కట్టుకట్టుకుని జగనన్నపై పోరాటానికి వస్తున్నాయన్నారు. ఈ యుద్ధానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం సావిత్రిబాయి పూలే 127 వ వర్ధంతిని సందర్భంగా రాష్ట్రపతి రోడ్ లో ఉన్న ఆమె విగ్రహానికి మంత్రి కారుమూరి పూలమాల వేసి నివాళులర్పించారు. అందరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధి చెందాలన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం

ఉండి: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త ఎఆర్ ఫిష్ ప్రొడక్స్ అధినేత ద్వారంపూడి నారాయణరెడ్డి అన్నారు. ఉండి గ్రామంలోని కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐడియల్ విజన్ సూపర్ హాస్పిటల్ ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న ద్వారంపూడి నారాయణరెడ్డి మాట్లాడారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు. లయన్స్ క్లబ్ భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది పాల్గొన్నారు. వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దాత లయన్ ఈపూరి సత్యనారాయణ ఆర్థిక సహకారంతో రోగులకు అవసరమైన కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ వేగేశ్న అనంతలక్ష్మి, సభ్యులు కునపరాజు రామరాజు, కాగిత మహంకాళి, కలిదిండి సీతారామరాజు, రుద్రరాజు నరసరాజు, బుద్ధరాజు సుబ్బరాజు, గొట్టుముక్కల రాము, నంబూరి విశ్వేశ్వరరావు, బొండాడ సూర్య బ్రహ్మానందం పాల్గొన్నారు.

నేడు సిద్ధాంతంలో చెరుకువాడ ప్రచారం

ప్రజాశక్తి - పెనుగొండ

ఈనెల 11న ఆచంట నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. సోమవారం మధ్యాహ్నం 4:00 గంటల నుంచి మండలంలోని సిద్ధాంతంలో సంపత వినాయక స్వామిని దర్శించుకుని ప్రచారంలో పాల్గొనున్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆచంట

ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించిన రామేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యాత్రికులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఐదు రోజులపాటు స్వామి వారికి ప్రత్యేకంగా మహాన్యాస పూర్ణక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. సుమారు లక్ష మంది యాత్రికలు ఉత్సవాల్లో పాల్గొన్నట్లు అధికారులు చెబుతున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో వ్యాపారాలు జోరుగా సాగాయి. అనంతరం మహిళలకు కుంకుమ భరిణలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బి.విద్యాసాగర్, ఇఒ రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని భ్రమరాంబ సమేత వనమల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్న సమారాధన చేశారు. ఇటీవల మహాసభ రాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.